పెన్ పవర్
రాయలసీమ
తిరుపతి । చిత్తూరు । అన్నమయ్య । వై.ఎస్.ఆర్ కడప । నంద్యాల । కర్నూలు । అనంతపురం

# బండి ఆత్మకూరు డ్రైనేజీ వ్యవస్థ,త్రాగునీటి సమస్యలను తీర్చమని ప్రజల విన్నపం



**బండి ఆత్మకూరు, పెన్ పవర్, జూలై 12:**శ్రీశైలం నియోజకవర్గం బండి ఆత్మకూరు మండలం లో కోటి రూపాయలతో నూతన డ్రైనేజీ నిర్మించినారు. అనతికాలంలోనే చేసిన పనులు వికటించి పోతున్నాయి. చేసిన పనులలో నాణ్యత లోపాలు ఉన్నాయి. కాబట్టి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ దాదాపు 20 మీటర్ల పొడవు డ్యామేజ్ అయ్యి ఒకవైపు కృంగి కాలువలోకి ఒరిగి పడింది. పంచాయతీ కార్యాలయమునకు కూత వేటు దూరంలో డ్రైనేజీ కాలువ ప్రవాహం సరిగా లేకున్నందుకు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు తాగునీటి సమస్య, ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న మంచినీటి సరఫరా నిలిచి ఇప్పటికి పది రోజులు అయినది. బాధిత ప్రజలు తాగునీటి కష్టాలతో ఇబ్బంది పడుతున్నారు. కావున ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీ విషయంలో పర్యవేక్షించి మంచినీటి సమస్యను కూడా పరిష్కరించాలని ప్రజలు, ప్రజాసంఘాలు కోరుతున్నాయి.

# సీబీఎన్ (4.0) పరిపాలన అదుర్స్.

- ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి
- బీపీసీఎల్ రిఫైనరీ సంస్థ అరవై వేల కోట్ల పెట్టుబడి.
- రాష్ట్రంలో విన్ ఫాస్ట్ ఆటోమొబైల్ సంస్థ సైతం పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి.
- జగన్ రెడ్డి తన పరిపాలనలో దివాలా దీసిన
- రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు అవిశ్రాంతంగా శ్రమిస్తున్న చంద్రన్న.



**పెన్ పవర్ – శ్రీ కాళహస్తి. జూలై 12:**"రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వ అవినీతి, అరాచకం మూలంగా పారిశ్రామికవేత్తలు పారిపోయారు. కొత్త పరిశ్రమలు రాకపోగా, ఉన్న పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోయ్యాయి. ఒకవైపు కక్షసాధింపు చర్యలు, మరోవైపు ముడుపుల కోసం బెదిరింపులు. దీంతో రాష్ట్రానికి కొత్తగా పారిశ్రామికవేత్తలు రావాలంటే వణికిపోయారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో నాలుగోవసారి ముఖ్యమంత్రి అయిన నారా చంద్రబాబునాయుడు ఒక్కక్షణం కూడా విశ్రమించకుండా అవిశ్రాంతంగా పనిచేస్తూ రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెడుతున్నారు." అని శ్రీ కాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నెల రోజుల్లోనే అద్భుతమైన ఫలితాలు కనబరుస్తూ ముందుకు దూసుకుపోతున్నారని అన్నారు. నెలరోజుల పాలన పూర్తిచేసుకున్న చంద్రన్న ప్రభుత్వం... మొదటి నెలలోనే పలు కీలక నిర్ణయాలు, సంక్షేమ పథకాల అమలుతో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారని అన్నారు. బాధ్యతలు చేపట్టిన తొలిరోజే అయిదు కీలక ఫైళ్లపై సంతకాలతో ప్రజలకు ఎనలేనిమేలు చేశారని తెలిపారు. 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, రూ.3 వేల నుంచి పెన్షన్లు రూ.4 వేలకు పెంపుతో పాటు గత ఏప్రిల్, మే, జూన్ నెలల బకాయిలు కలిపి మొత్తం రూ.7 వేలు పెన్షన్ అందజేత, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, సిల్క్ గణన కార్యక్రమం అమలుకు చర్యలు ప్రారంభించారని అన్నారు. ఇసుక విధానాన్ని తిరిగి పునరుద్దరించడంతో ప్రస్తుతం రాష్ట్రంలో ఒక పండుగ వాతావరణం నెలకొందని, ప్రభుత్వ చర్యలతో నిర్మాణ రంగానికి ఊతమిచ్చినట్టైందన్నారు. ఎన్నికల హామీల్లో ఇచ్చిన హామీ మేరకు వచ్చే ఐదేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల ఉద్యోగాలు కల్పన కోసం ఇప్పటికే చంద్రబాబు పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశాలు నిర్వహిస్తూ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షిస్తున్నారని పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తల్లో నమ్మకం కలిగించేలా చర్యలు ప్రారంభించడంతో బీపీసీఎల్ రిఫైనరీ సంస్థ ఏపీలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైందని, విన్ ఫాస్ట్ ఆటోమొబైల్ సంస్థ సైతం పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిందన్నారు. మరోవైపు వైసీపీ హయాంలో జరిగిన విధ్వంసంపై 7 ముఖ్యమైన శాఖల శ్వేతపత్రాలు విడుదలకు చర్యలు ప్రారంభించారు. ఇప్పటికే పోలవరం, అమరావతి, విద్యుత్ రంగాలపై శ్వేతపత్రాలు విడుదల చేయగా మిగిలిన శాఖలపై మరింత లోతైన దర్యాప్తు చేపడుతూ జగన్ ప్రభుత్వ ఆకృత్యాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని అన్నారు. నెలరోజుల పరిపాలన పూర్తి చేసుకున్న చంద్రబాబు... నూటికి నూరు మార్కులు సాధించారని, అధికారమంటే పదవి కాదు... బాధ్యత అని చాటి చెబుతూ ఎటువంటి హంగామా, హడావిడి లేకుండా సింపుల్ గవర్నమెంట్... ఎఫెక్టివ్ గవర్నెన్స్ తో సీబీఎన్ 4.0తో మరింత దూకుడు పెంచి రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తుండటంతో బాబు పరిపాలన అదిరిందంటూ రాష్ట్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని బొజ్జల వెల్లడించారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం






- ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

**పలమనేరు జూలై 12,(పెన్ పవర్):**విద్యకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ రెడ్డి పేర్కొన్నారు. పెద్దపంజాణి మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హైస్కూల్ ప్లస్ జూనియర్ కళాశాలను ప్రారంబించారు. ఈ సందర్భంగా పాఠశాల ఏర్పాటుకు సహకరించిన ప్రజా ప్రతినిధులు దాతలను ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం ఉపాధ్యాయులతోనే సాధ్యమవుతుందని ఆ దిశగా ప్రతి ఉపాధ్యాయులు కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడులలో విద్యాబోధన చేపట్టాలని కోరారు. ఇక ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు ఆ ప్రాంతానికి చెందిన ఎన్నారైలు మరియు స్థానికంగా ఉన్న పరిశ్రమలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తన వంతు సహకారం అందిస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అనంతరం పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు ఆయన ప్రతిభా పురస్కారాలను అందించారు. అదేవిధంగా విద్యార్థులకు స్కూల్ కిట్స్ ను పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఈఓ పురుషోత్తం, ఎంఈవో లు గోపాల్ రెడ్డి,తులసిరామ్, హెచ్ఎం కేశవ పిళ్ళే, ఎంపీపీ రెడ్డెప్ప, జెడ్పీటిసి సుష్మకీర్తి, సర్పంచ్ అఖిల, మరియు మాజీ ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి, మాజీ జడ్పీటీసి చెంగారెడ్డి,సీనియర్ టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, శ్రీరాములు,కృష్ణారెడ్డి, రవిజెట్టి,నాగరాజు, బాబాజాన్ తదితరులు ఉన్నారు.